క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్‌తో ఆర్థిక వెసులుబాటు



నగదు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కోన

బాపట్ల: ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్‌తో బాధితులకు ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. పట్టణంలోని ప్యాడిషన్ పేటకు చెందిన గుడిపాటి రాజాకు ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ రూ.28వేలు చెక్కును ఆదివారం అందించారు. విద్య, వైద్యం కోసం వైఎస్సార్ సీపీ అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని కోన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ జిల్లా నాయకులు ఇనగలూరి మాల్యాద్రి, వడ్డిముక్కల డేవిడ్, గేరా మణిభూషన్ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రను విజయవంతం చేయాలి



భట్టిప్రోలు: ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న పాదయాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు పి.నాగాంజనేయులు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోడి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జి.బాలాజి, వేమూరు నియోజకవర్గ కార్యదర్శి బండారు శ్రీనివాసరావు, నాయకులు ఒ.రమేష్, వి. శ్రీనివాసరావు, టి. రఘురామ్ ప్రసాద్, టి.సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

పెదపులివర్రు(భట్టిప్రోలు): వైఎస్సార్ ఆసరా పథకం కింద రుణమాఫీ మూడవ విడత నగదు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమ చేయడంతో.. పెదపులివర్రులో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి ఆధ్వర్యంలో ఆదివారం స్వయం సహాయక పొదుపు సంఘాల మహిళలు ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. యానిమేటర్ పులివర్తి మంజూష, వలంటీర్ టి.రత్నకుమారి, అంగన్‌వాడీ కార్యకర్త సీహెచ్ సీతమ్మ, సీఆర్పీలు వాసిమళ్ల నవ్య, ప్రజ్ఞం లక్ష్మీ తిరుపతమ్మ గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ మద్రామాయణ సప్తాహ కార్యక్రమం



ఐలవరం(భట్టిప్రోలు): ఐలవరంలో టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీమద్రామాయణ సప్తాహ కార్యక్రమం ఆదివారం మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా మాచర్ల రంగారావు మాట్లాడుతూ రామ నామంతో కిరాతకుడైన రత్నాకరుడు వాల్మీకి మహర్షిగా మారి రామాణం రాశారన్నారు. మానవుడు రామనామంతో మహర్షిగా ఎదగాలని రామ మహిమ గూర్చి వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు, అర్చకులు దీవి రఘునాథ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

రేపల్లె రూరల్: రుద్రవరం గ్రామంలో కోడి పందేల స్థావరంపై స్థానిక పోలీసులు ఆదివారం దాడులు చేసి, పది మందిని అదుపులోకి తీసుకున్నారు. సీఐ విజయచంద్ర వివరాలు వెల్లడించారు. దాడిలో 11 కోళ్లు, రూ.7,150ల నగదు, 22 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు.

సాయి ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం

తెనాలిటౌన్: గాంధీనగర్‌లోని షిరిడీ సాయి వృద్ధాశ్రమంలో శ్రీవెంకటేశ్వర సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులకు అన్నదానం చేశారు. యోగ సభ్యులు యోపూరి గోపాలరావు, అనూష దంపతుల పెళ్లి రోజు సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని కఠెవరం గ్రామ మాజీ సర్పంచ్ గంపల శివనాగేశ్వరరావు ప్రారంభించి మాట్లాడుతూ యోగ సభ్యులు పుట్టిన రోజు, పెళ్లి రోజు వేడుకలు వృద్ధుల సమక్షంలో జరుపుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్వీయోగ కన్వీనర్ ఎం.రమణయ్య, దీక్షిత, తేజసాయి నరసింహ, ఆశ్రమ నిర్వాహకులు సత్యనారాయణ, సునీత, పలువురు యోగసాధకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- పట్టణ ఆర్యవైశ్య లీగల్ సెల్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం



ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి నూతనంగా ఏర్పాటు చేసిన లీగల్ సెల్ సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సూచించారు. తెనాలి పట్టణ ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం, అనుబంధ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన తెనాలి పట్టణ ఆర్యవైశ్య లీగల్ సెల్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్సవాన్ని బోసురోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో ముందుంటున్నారని పేర్కొన్నారు. పేద ఆర్యవైశ్యుల సమస్యలను పరిష్కరించడం, సూచనలు, సలహాలు అందించేందుకు లీగల్ సెల్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. లీగల్ సెల్ సభ్యులు బాధ్యతగా వ్యవహరిస్తూ భరోసా కల్పించాలని సూచించారు. ఆర్యవైశ్య సంఘాలు మరింత అభివృద్ధి చెందాలని అభిలాషించారు. అనంతరం లీగల్ సెల్ చైర్మన్‌గా నియమితులైన దరిశి శివకోటేశ్వరరావు, సలహాదారులు మద్ది మల్లికార్జునరావు, వైస్ చైర్మన్లు పొత్తూరి నాగేంద్రం, గ్రంధి జయరామ్, జవ్వాజి శ్రీనివాసరావు, కొత్తమాసు గురునాథబాబు, గొడవర్తి భాస్కరరావు, అప్పల కిషోర్, కోట కౌషిక్, సంకా ఆంజనేయులు, సంకా కోటేశ్వరరావు, సంకా చంద్రశేఖర్‌తో ఆర్యవైశ్య నాయకులు సాధు ప్రతాప్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం సభ్యులను ఘనంగా సన్మానించారు. తెనాలి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భాస్కరుని శ్రీనివాసరావు సభకు అధ్యక్షత వహించగా ప్రముఖ పారిశ్రామికవేత్త నూకల వేణు, తెనాలి పట్టణ ఆర్యవైశ్య సంఘాల కో–ఆర్డినేటర్లు మద్దాలి శేషాచలం, వివిధ సంఘాల నాయకులు కొల్లా గురునాథ గుప్తా, కూరపాటి రవికుమార్, కర్పూరపు రఘునాథ మూర్తి, ఆతుకూరి పూర్ణచంద్రరావు, చుండూరు సాయి, కొండవేటి లక్ష్మీ పద్మావతి, చుండూరు వెంకట శివప్రసాద్, తూనుగుంట్ల సుబ్బారావు, పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

బండ్లమ్మ సన్నిధిలో మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం



మాజీ సీఎస్ సుబ్రహ్మణ్యంకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈఓ నరసింహమూర్తి

చందోలు(పిట్టలవానిపాలెం): మండలంలోని చందోలులో వేంచేసిన శ్రీ బగళాముఖి బండ్లమ్మ దేవాలయంలో చైత్ర మాసం మొదటి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పొంగళ్లు పొంగించి, అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని ఏపీ మాజీ చీఫ్ సెక్రటరీ ఎల్వీ సుబ్రహ్మణ్యం దర్శించుకున్నారు. దేవాలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి అమ్మవారి చిత్రపటాన్ని ఆయన బహూకరించి, శేష వస్త్రంతో ఘనంగా సత్కరించారు.

నేడు వీర బ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల

కర్లపాలెం: ఏట్రవారిపాలెం గ్రామంలోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి ఆరాధన తిరునాళ్ల మహోత్సవం సోమవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశామని గ్రామ పెద్దలు ఆదివారం ప్రకటనలో తెలిపారు. 60 ఏళ్లుగా వైభవంగా జరిగే ఆరాధన మహోత్సవాలు జిల్లాలోనే ఎంతో పేరు గడించాయని తెలిపారు. గ్రామంలోని భక్తులు వీర బ్రహ్మేంద్రస్వామి మొక్కుబడి జెండాలను ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లపై ఉంచి ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకొస్తారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు ఈ సందర్భంగా తెలిపారు.

28 నుంచి నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు

పిట్టలవానిపాలెం: అల్లూరు గ్రామంలో వేంచేసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ వాలి వెంకట శివారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 7 వరకు ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. 5న స్వామివారి రథోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. అన్న సంతర్పణ, ప్రతి రోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

నరాల వ్యాధులపై అప్రమత్తత అవసరం



డాక్టర పవన్‌కుమార్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

తెనాలిరూరల్: నరాల వ్యాధులపై అప్రమత్తత అవసరమని నిమ్స్ న్యూరో సర్జన్ డాక్టర్ బడుగు పవన్‌కుమార్ పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కవిరాజు పార్కులోని వీజీకే భవనంలో ఆదివారం సాయంత్రం జరిగిన సమావేశంలో డాక్టర్ పవన్‌కుమార్ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. వృద్ధాప్యంలో వచ్చే నరాల బలహీనతలు, మెదడులోని నరాల్లో రక్తం గడ్డ కట్టడం, రక్త ప్రసారానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వెన్నుపూస సమస్యల గురించి వివరించారు. ఎప్పటికప్పుడు వైద్యులను సంప్రదించి తగు వైద్య పరీక్షలు చేయించుకుంటూ అవసరమైన మందులు వాడాలని చెప్పారు. తేలికపాటి వ్యాయామం, నడకతో ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పవన్‌కుమార్‌ను అసోసియేషన్ సభ్యులు సత్కరించారు. మొవ్వ సత్యనారాయణ, బొమ్మదేవర వెంకటేశ్వరరావు, సోమరౌతు నాగేంద్రయ్య, డాక్టర్ పసుపులేటి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఒకే జాతి, ఒకే భాష విధానంతో ప్రాంతీయ భాషలకు చేటు



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

తెనాలిరూరల్: కే జాతి–ఒకే భాష విధానంతో ప్రాంతీయ భాషల మనుగడ ప్రమాదకరంగా తయారవుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. జనసాహితి సంస్థ ఆధ్వర్యంలో కొత్తపేటలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో ఆదివారం సాయంత్రం సదస్సు నిర్వహించారు. 'తెలుగు మాధ్యమం–ఎదుర్కొంటున్న సవాళ్లు' అన్న అంశంపై జరిగిన సదస్సులో పలువురు ప్రముఖులు మాట్లాడారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి నందివెలుగు ముక్తేశ్వరరావు మాట్లాడుతూ అటు తెలుగు, ఇటు ఇంగ్లిష్ రాని తరాలను తయారు చేస్తున్న పాలకుల విధానాలపై పోరాడాల్సిన అవసరముందన్నారు. తెలుగు భాషోద్యమం ఎదుర్కొంటున్న సవాళ్లపై ప్రసంగించారు. ఏలూరు ఆశ్రమ్ వైద్య కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు భాషను రక్షించుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో భాగంగా చందు నాగేశ్వరరావు రచించిన 500 కంద పద్యాల పుస్తకం, జనసాహితి ఆధ్వర్యంలో రూపొందించిన 'సృజనకు విత్తు–సొంత భాష' పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు. జనసాహితి అధ్యక్షుడు దివి కుమార్ అధ్యక్షత వహించగా, డాక్టర్ పిల్లి వాసు, పి.మధు, గిడుగు వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు. పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

సంస్కృతి పరిరక్షణలో సాహిత్యానికి అనుబంధం



శ్రీ సిద్ధేశ్వరానంద భారతి

పాత గుంటూరు: సనాతన భారతీయ సాంస్కృతిక జీవన స్రవంతిలో సాహిత్యంతో విడదీయరాని అనుబంధం ఉందని కుర్తాళం శంకరాచార్య జగద్గురు శ్రీ సిద్ధేశ్వరి పీఠాధిపతులు శ్రీ సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి పేర్కొన్నారు. రవీంద్రనగర్ (కొత్త పట్టాభిపురం) కుర్తాళ శ్రీ సిద్ధేశ్వరి పీఠ మంత్రాశ్రమంలో 'శ్రీ సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి 87వ వసంతోత్సవాల్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్వామి ప్రత్యక్ష సన్నిధిలో జరిగిన ధర్మ చైతన్య సాహితీ సభలో కవులు సుఖవాసి మల్లికార్జున రాయశాస్త్రి, రామడుగు వెంకటేశ్వరశర్మ, నారాయణ శేషుబాబు, గోలి హనుమత్‌శాస్త్రి, అవ్వారి గోపాలకృష్ణశర్మ, కోగంటి వీర రాఘవాచార్యులు, రావి రంగారావు, నారాయణ శేషుబాబు, వి. నాగరాజ్యలక్ష్మి, మైలవరపు లలిత కుమారి, తాటికోల పద్మావతి తదితర కవులు సాహిత్య గోష్ఠిలో పాల్గొని ఆహుతుల్ని రంజింప చేశారు. అనంతరం సభకు మంత్ర ఆశ్రమ నిర్వాహకులు శ్రీ నరసింహానంద భారతీస్వామి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో డాక్టర్ డి.ఎస్. దీక్షిత్, గబ్బిట శివరామకృష్ణ ప్రసాద్, కార్యక్రమ నిర్వాహకులు పి. హైమానంద్, రవికిశోర్, రామకృష్ణ పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్ వద్ద ఆదివారం అనారోగ్యంతో మరణించిన అనాథ వృద్ధుడికి గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు చేశారు. అనాథ శవం ఆస్పత్రిలో ఉన్నట్లు కొత్తపేట పోలీసులు సమాచారం ఇవ్వడంతో అంత్యక్రియలు నిర్వహించామని ట్రస్ట్ నిర్వాహకులు పఠాన్ అల్లాభక్షు తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో కోవిడ్‌లో మరణించిన అనేకమందికి అంత్యక్రియలు చేశామని చెప్పారు. సొంతంగా అంబులెన్స్ పెట్టి గుంటూరు నగరంలో పేదల్ని ఆస్పత్రి నుంచి ఇళ్లకు, ఇళ్ల నుంచి ఆస్పత్రులకు ఉచితంగా తరలిస్తున్నామని తెలిపారు. జీజీహెచ్ వద్ద రోగుల సహాయకులకు దాతల సహాయంతో ఉచితంగా భోజనం పెడుతున్నామని వెల్లడించారు. అనాథలుగా రోడ్డుపై ఉంటున్న పలువురిని పలు వృద్ధాశ్రమాలు, అనాథ ఆశ్రమాల్లో చేర్పించామని తెలిపారు. ట్రస్ట్ సేవల్ని వినియోగించుకోవాలనుకునేవారు 8143222456, 9397602553 నంబర్స్‌లో సంప్రదించాలని అల్లాభక్షు కోరారు.

కఠెవరంలో పిల్లల ఉచిత వైద్య శిబిరం



తెనాలిటౌన్: రూరల్ మండలం కఠెవరంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం న్యూలైఫ్ చిల్డ్రన్ హాస్పటల్ తెనాలి వారి ఆధ్వర్యంలో పిల్లల ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చిన్నారులకు డాక్టర్ రాధిక రాజశేఖర్ కుప్పా వైద్య పరీక్షలు జరిపారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ రాజశేఖర్, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కేటీఎస్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

దళిత క్రిస్టియన్లపై అసెంబ్లీలో తీర్మానం హర్షణీయం



తెనాలిటౌన్: రాష్ట్రంలో బోయ, వాల్మీకి కులాలను ఎస్టీల జాబితాలో, దళిత క్రిస్టియన్‌లను ఎస్సీల జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేయడం హర్షణీయమని జైభీమ్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు కఠెవరపు దేవానంద్ పేర్కొన్నారు. గంగానమ్మపేటలోని జైభీమ్ ఫెడరేషన్ కార్యాలయంలో ఆదివారం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దేవానంద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మేలు చేసే నిర్ణయాలు అద్భుతమన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు కొత్తపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భవనం ప్రారంభం



తెనాలిఅర్బన్: బుర్రిపాలెం రోడ్డులోని మహాప్రస్థానంలో నూతనంగా నిర్మించిన డాకా లక్ష్మిరెడ్డి, లక్ష్మమ్మ సామాజిక భవనాన్ని ఆదివారం మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త కొత్త సుబ్రహ్మణ్యం, కౌన్సిలర్ అడుసుమల్లి వెంకటేశ్వరరావు, మహాప్రస్థాన సేవా సమితి అధ్యక్షుడు డాకా సాంబిరెడ్డి, ప్రధాన కార్యదర్శి జెట్టి శివరామకృష్ణప్రసాద్, కోశాధికారి బండి సాంబశివరావు, నాయకుడు చదలవాడ శంకర్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొండ చర్చిలో ఆరాధన కూడిక

తెనాలిటౌన్: ఇస్లాంపేటలోని యేసయ్య ప్రార్థనా కొండ చర్చిలో ఆదివారం ప్రత్యేక ఆరాధన కూడికను నిర్వహించారు. పాల్ అండ్ లూక్ మెమోరియల్ మినిస్ట్రీస్ డైరెక్టర్ బ్రదర్ ఆనందన్న వాక్యోపదేశం చేశారు. యేసుక్రీస్తును, ఆయన శ్రమలను ధ్యానించడం ద్వారా అనేక మేలులు కలుగుతాయని తెలిపారు. రోగుల కోసం ప్రత్యేక స్వస్థత ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో చార్లెస్ వెస్లీ, పాల్ రాజశేఖర్, ప్రశాంత్‌బాబు, సీమోను, సంఘపెద్దలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విజ్ఞాన గని

గుంటూరు ఎడ్యుకేషన్: అంబేడ్కర్ అంటే విజ్ఞాన గని అని గుంటూరు పశ్చిమ తహసీల్దార్ సాంబశివరావు అన్నారు. ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ రాష్ట్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్ జీవిత చరిత్ర, కుల నిర్మూలన, రాజ్యాంగం అనే అంశాలపై ఏసీ కళాశాలలో ప్రతిభా పరీక్ష నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన 200 మంది ఉద్యోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో తహసీల్దార్లు సాంబశివరావు, ప్రభాకర్ మాట్లాడుతూ అంబేడ్కర్ అంటే ఆత్మగౌరవానికి ప్రతీక అని కొనియాడారు. ఆయన బాటలో ప్రతి ఒక్కరూ నడిచి, ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు కిరణ్ మాట్లాడుతూ కుల వ్యవస్థ నిర్మూలన కోసం పాటుపడితేనే సమ సమాజ స్థాపన సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమాన్ని నిర్వహించిన డెప్యూటీ తహసీల్దార్ దేవరాజ్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని పవిత్ర గ్రంథంగా ప్రతి ఒక్కరూ చదివి తెలుసుకోవాలని సూచించారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొమ్మాలపాటి మోజెస్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గోల్డెన్ జూబ్లీ స్నేహం



గోల్డెన్ జూబ్లీ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

కొల్లూరు : ఐదు దశాబ్దాల అంతరం వారి స్నేహబంధాన్ని దూరం చేయలేకపోయింది. ఐదు దశాబ్దాల అనంతరం తమ బాల్య జ్ఞాపకాలను మరోసారి నెమరు వేసుకుని, గోల్డెన్ జూబ్లీ వేడుకలు చేసుకున్నారు. తరగతి గదిలో అప్పటి మధుర స్మృతులను పంచుకున్నారు. ఆదివారం కొల్లూరులోని ఎంప్లాయిస్ రీక్రియేషన్ హోమ్‌లో పూర్వ విద్యార్థులు సమ్మేళనమయ్యారు. కొల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1971–72 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు కలుసుకుని ఉత్సాహంగా గడిపారు. అప్పట్లో విద్యనభ్యసించిన 124 మంది విద్యార్థుల్లో 74 మంది ఒక్క చోటకు చేరారు. తమ మధ్య లేని మిత్రులకు స్మరించుకొన్నారు. తమ స్నేహానికి 50 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా.. గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ చేసుకున్నారు. కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు చెప్పుకున్నారు. సమ్మేళనం తీపి గుర్తుగా.. 50 ఏళ్ల లోగోతో ముద్రించిన 15 గ్రాముల బరువైన వెండి నాణాన్ని బహూకరించారు. ఈ సమ్మేళనానికి సమన్వయకర్తలుగా జనస్వామి గోపాలకృష్ణమూర్తి, కుర్ర సత్యనారాయణ, సుంకర విష్ణువర్ధన్, కానూరు రామకృష్ణ ప్రసాద్ వ్యవహరించారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



పరీక్షలు చేస్తున్న వైద్యులు



ఉచిత వైద్యశిబిరంలో పరీక్ష చేస్తున్న వైద్యులు

రేపల్లె: పేదలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ విజయసారథి అన్నారు. రేపల్లె రెడ్‌క్రాస్, తెనాలి హ్యాపీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో మాజీ శాసన సభ్యుడు ఈవూరి సుబ్బారావు, మాజీ మంత్రి ఈవూరి సీతారావమ్మల జ్ఞాపకార్థం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. వైద్యులు రోగులకు సహనంతో సేవలు అందించాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్లు ఉప్పలపు నారాయణస్వామి, ఉప్పలపు పావని ప్రియాంక, మహేష్ కిరణ్, పెనుమాక అరుణ్ తేజ్, వినీల్, బీవీ గురునాథ శర్మ, ఎం.శ్వేత, కిషన్ బాబు 108 మందికి బీపీ, షుగర్, ఆయాసం, చెవి, ముక్కు, గొంతు, క్యాన్సర్, ఎముకలకు సంబంధించిన సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ తెనాలి బ్రాంచ్ కార్యదర్శి భానుమతి, రేపల్లె బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ వసంతం వీర రాఘవయ్య, సొసైటీ సభ్యులు మోపిదేవి వెంకటేశ్వరరావు, అడుసుమల్లి ప్రభాకర్‌రావు, సయ్యద్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

వెల్లటూరులో ఉచిత వైద్య శిబిరం

వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరు పీహెచ్‌సీలో ఆదివారం గుంటూరు లలితా సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు బి. కోటేశ్వరరావు వైద్య పరీక్షలు చేశారు. ఇకపై ప్రతి నెల ఆఖరి ఆదివారం వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. 40 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. పారా మెడికల్ సిబ్బంది వైద్య సేవలు అందించారు.

దళిత రాజ్యం మండల కమిటీ ఎంపిక



కమిటీ సభ్యులు

కొల్లూరు : దళితుల సమస్యలపై పోరాడేందుకు ఏర్పాటు చేసిన దళిత రాజ్యం మండల కమిటీ ఎంపిక ఆదివారం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక ఎస్సీ ఏరియాలో దళిత రాజ్యం మండలాధ్యక్షుడిగా కంచర్ల సందీప్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దాసరి ఆనంద్, ఉపాధ్యక్షుడిగా ఊదరగుడి రాకేష్ బాబు, ప్రధాన కార్యదర్శిగా గుమ్మడి వినయ్ కుమార్, మండల ప్రచార కమిటీ అధ్యక్షుడిగా తెనాలి చంద్రశేఖర్, మహిళా అధ్యక్షురాలిగా విప్పర్ల శ్రీలక్ష్మి, వర్కింగ్ వైస్ ప్రెసిడెంట్‌గా విప్పర్ల గోపీనాథ్, యువజన అధ్యక్షుడిగా యడ్ల సాయి పృథ్వి, ప్రధాన సభ్యుడిగా పెగ్గెం జయరావు, మండల కార్యదర్శిగా మునిపల్లి యెహోను, యువజన కార్యదర్శిగా ఎద్దు సంజీవ్ కుమార్, ప్రచార కమిటీ కార్యదర్శిగా కంచర్ల చందును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూనతంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. మండలంలోని దళితుల సమస్యల పరిష్కారం కోసం పాటుపడతామని పేర్కొన్నారు.

కొలకలూరులో పారిశుద్ధ్య పనులు



ఎస్టీ కాలనీలో రోడ్ల వెంబడి ఉన్న చెత్తను తొలగిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు

తెనాలిటౌన్: కొలకలూరు గ్రామంలో బాపట్ల వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థినులు నిర్వహిస్తున్న జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) నాల్గవ రోజుకు చేరింది. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్, ప్రొఫెసర్ ప్రసన్నకుమారి పర్యవేక్షణలో విద్యార్థినులు పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలు, ముళ్ల కంప తొలగించి శుభ్రం చేశారు. రోడ్ల వెంబడి ఉన్న చెత్త, చెదారాలను తొలగించారు. అనంతరం గ్రామంలో దోమల నివారణ కార్యక్రమాన్ని చేపట్టి దోమలను ఎలా నివారించుకోవాలో గ్రామస్తులకు తెలియజేశారు. రంపం పట్టు, ఇంజన్ ఆయిల్ ఉపయోగించి ఉండలు ఎలా తయారు చేసుకోవాలో చూపించి, వాటిని దోమలు ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో, దోమలు గుడ్లు పట్టే ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ఇలా చేయడం వల్ల దోమల లార్వా చనిపోయి వాటి గుడ్లు కరిగిపోతాయని గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రసన్నకుమారి, నాగలక్ష్మి, మేస్త్రి గణేష్, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే ఫాసిస్టు ప్రభుత్వాలకు అడ్డుకట్ట

విరసం రాష్ట్ర నాయకురాలు వరలక్ష్మి



సభలో మాట్లాడుతున్న వరలక్ష్మి

పాత గుంటూరు: బ్రాడీపేట సీపీఎం కార్యాలయంలో దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం ఆధ్వర్యంలో అమరులు కామ్రేడ్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ 92వ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర సదస్సు నిర్వహించారు. భారతీయ సంస్కృతుల పరిణామం, ఫాసిజం, ఫాసిస్టు వ్యతిరేక ఐక్య సంఘటన ఆవశ్యకతపై నిర్వహించిన సభకు పీడీఎం రాష్ట్ర అధ్యక్షుడు కె. శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న విప్లవ రచయితల సంఘం రాష్ట్ర నాయకురాలు వరలక్ష్మి మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుంచి నేటి వరకు పాలక పార్టీలు దోపిడీదారుల పక్షానే ఉంటున్నాయని విమర్శించారు. ఐక్య ఉద్యమాలతోనే ఫాసిస్ట్ ప్రభుత్వాల్ని ఎదుర్కోగలమని తెలిపారు. రాష్ట్ర పీడీఎం ప్రధాన కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ ఫాసిస్ట్ ప్రభుత్వాల దమనకాండను ఎదుర్కోవాలంటే ప్రజాస్వామ్యవాదుల ఐక్య కార్యాచరణ ద్వారా మాత్రమే సాధ్యమని వివరించారు. అనంతరం 'అదాని ప్రకంపనలు– వ్యవస్థాగత సంక్షోభానికి ఉదాహరణ' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రజాకళా మండలి గాయకులు ఆలపించిన ప్రజా చైతన్య గేయాలు సభికుల్ని ఉత్తేజపరిచాయి. కార్యక్రమంలో ఎస్. వేణుగోపాల్, ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ కన్వీనర్ రమేష్ పట్నాయక్, సి.ఎస్.ఆర్. ప్రసాద్, నల్లూరి రుక్మిణి, పీపీఎం కార్యదర్శి సుధాకర్, హనుమంతరెడ్డి, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.